క్లుప్తంగా

రేపటి నుంచి ఉచిత కుట్టు శిక్షణ

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని పెద్ద శివాలయం ఎదురుగా ఉన్న బచ్చు రామేశం సత్రంలో నిరుపేద మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు సత్రం చైర్మన్ పైండా రామకృష్ణరావు ఆదివారం తెలిపారు. రెండు బ్యాచ్‌లుగా ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి 1 వరకూ, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటలకు మహిళలకు అనుభవజ్ఞులైన వారితో శిక్షణ ఉచితంగా ఇస్తున్నామన్నారు.

మానవ వనరులతో అభివృద్ధి

కాకినాడ రూరల్: మానవ వనరుల అభివృద్ధి ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రీజినల్ కో ఆర్డినేటరు, రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యను ప్రోత్సహించేందుకు సీఎం జగన్ అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను ప్రారంభించడం ద్వారా ఎక్కువ మందిని వైద్యులుగా తీర్చిదిద్దే చర్యలు తీసుకున్నారన్నారు.

బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం

బోట్‌క్లబ్: రానున్న ఎన్నికల్లో పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణరాజు అన్నారు. బీజేపీ దక్షిణ మండల అధ్యక్షులు చెక్కా రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం సిటీ నియోజకవర్గంలోని 146వ బూత్‌లో ఏర్పాటు చేసిన సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ నాయకులు మాలకొండయ్య, పైడా వెంకటనారాయణ, పైడిమల్ల చెరియన్, దొడ్డి వీరేంద్ర, రత్నాల కృష్ణారావు పాల్గొన్నారు.

ఖురాన్ పఠన పోటీలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న అబ్దుల్ బషీరుద్దీన్

కాకినాడ సిటీ: నగరంలోని జె.రామారావుపేట మక్కా మసీదు కమిటీ ఆధ్వర్యంలో మద్రాసా అరబియా హాబిబిలో చదువుతున్న పిల్లలకు ఖురాన్ పఠనం పోటీలు నిర్వహించారు. ఉత్తీర్ణులైన పిల్లలకు ఆదివారం బహుమతులను ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు అబ్దుల్ బషీరుద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం పిల్లలు ఇస్లాం మూలాలను, ఖురాన్ చదవడం నేర్చుకోవడం చాలా అవసరమన్నారు. హాజీ మదీన, నగూర్ వలీ, అక్బర్ ఖాన్, వలిబాసా తదితరులు పాల్గొని 120 మంది పిల్లలకు బహుమతులు అందజేశారు.

ఆవును ఢీకొని యువకుడి మృతి

కరప: రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆవును ఢీకొని ఒక యువకుడు దుర్మారణం పాలయ్యాడు. కరప పోలీసులు తెలిపిన కథనం మేరకు.. కరప గ్రామానికి చెందిన తాపీమేస్త్రి దున్నే సూరిబాబు (40) ఆదివారం రాత్రి పెనుగుదురు వైపు నుంచి ఇంటికి వస్తుండగా కరప దుర్గాదేవి ఆలయం వద్ద రోడ్డుపై అడ్డుగా ఉన్న ఆవును ఢీ కొని కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కరప ఎస్సై ఎస్ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరిడమ్మ దర్శనానికి కిటకిట

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే మరిడమ్మ జాతరలో భాగంగా శ్రావణ మాసం మొదటి ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీ క్యూ కట్టారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. సుమారు లక్ష వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా.

ఆమె సాధికారితలో..



కౌమార బాలికల ఆరోగ్యంపై ప్రచురించిన పుస్తకం

- మహిళలను చైతన్యవంతం చేస్తున్న సిడో
- కౌమార బాలికల ఆరోగ్యంపై అవగాహన

కాకినాడ కల్చరల్: మహిళల్లో ఆత్మవిశ్వాసం నింపి వారి పురోభివృద్ధికి సెంటర్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ వుమెన్ (సిడో) ఎంతో కృషి చేస్తోంది. 1998లో కాకినాడలో ప్రారంభమైన ఈ సంస్థకు డాక్టర్ అలూరి విజయలక్ష్మి అధ్యక్షురాలిగా, పసుమర్తి పద్మజావాణి కార్యదర్శిగా, ఎస్.భానుమతి, ఎస్.ఉషారాణి, ఆర్ఎ రావు ట్రస్టీలుగా వ్యవహరిస్తున్నారు. మహిళల ఆరోగ్యం, ఆర్థిక వృద్ధి లక్ష్యంగా ఈ సంస్థ పని చేస్తోంది.

లక్ష్య సాధనలో అహరహం..

పాఠశాలల్లోని కౌమార బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవడం, బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ఎంతో సేవ చేస్తున్నారు. శ్రీసత్యసాయి సేవాసమితి సహకారంతో 500 మందికి వైద్యసేవలు అందజేశారు. అలాగే పునరుత్పత్తి, లైంగిక ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, లైంగిక వివక్ష, లైంగిక హింస, జీవన నైపుణ్యాలు తదితర అంశలపై 150 మంది బాలికలకు శిక్షణ ఇచ్చి గ్రామణ స్థాయిలో బాలికలకు, మహిళలకు అయా అంశాలపై సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. 'కౌమర బాలికల ఆరోగ్యం' పేరుతో సంస్థ వ్యవస్థాకురాలు డాక్టర్ ఆలూరి రచించిన పుస్తకాలను సుమారు లక్ష మందికి ఉచితంగా అందజేశారు. మహిళలపై హింసను ఆపాలని, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని పోరాటాలు చేస్తున్నారు. వృత్తి విద్యల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. 2004లో ప్రపంచ బ్యాంక్ భారత దేశంలోని గ్రామాల్లో విద్య, ఆరోగ్య, విద్యుత్ మొదలైన సేవల పెంపుదల కోసం నిర్వహించిన సృజనాత్మక ప్రాజెక్టు పోటీలలో సిడో స్థానం సాధించింది. మహిళల కోసం న్యాయ సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేసి అవసరమైన సాయం చేయడం, ప్రతిభావంతులైన మహిళలకు పేద బాలికలకు స్కాలర్‌షిప్‌లు అందిస్తూ చేయూతనిస్తోంది.





సిడో కేంద్రంలో కుట్టులో శిక్షణ పొందుతున్న మహిళలు. (అంతర చిత్రం) కౌమర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి

ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం



ముఖ్యంగా ఇల్లాలిని బట్టే ఇల్లు బాగుంటుంది. కాబట్టి ప్రతి మహిళ ఆరోగ్యంపై జాగ్రతలు తీసుకోవాలి. తాను ఆరోగ్యంగా ఉంటూ, కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత గృహిణులపై ఉంది. కౌమర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రస్తుతం ఎంతైనా ఉంది.

– డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి, అధ్యక్షురాలు, సిడో, కాకినాడ

ఆర్థిక పురోభివృద్ధి



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ఆశయంతో సిడో పనిచేస్తోంది. కనుక ఉపాధి శిక్షణ రంగాల్లో మహిళకు శిక్షణ ఇస్తున్నాం. మహిళలు తమకాళ్లపై తాము నిలబడి ఆత్మగౌరంతో ముందుగా సాగేందుకు కృషి చేస్తున్నాం. ప్రతిభ గల పేద బాలికలను ప్రోత్సహించేందుకు స్కాలర్ షిప్ యేటా అందజేస్తున్నాం.

– పసుమర్తి పద్మజావాణి, కార్యదర్శి, సిడో, కాకినాడ

ముస్లింలకు అండగా ఉంటాం



కరపత్రాలను కురసాల సత్యనారాయణతో కలసి ప్రదర్శిస్తున్న ముస్లిం పెద్దలు

కాకినాడ రూరల్: నియోజకవర్గంలోని మసీదుల అభివృద్ధికి సహకరిస్తామని, ముస్లింలకు అండగా ఉంటామని నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పేర్కొన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీం బాషా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ముస్లింలు ఆదివారం రమణయ్యపేటలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను కురసాల సత్యనారాయణకు వివరించి, మసీదులు అభివృద్ధికి వినతి పత్రం అందించారు. హజ్ యాత్రకు సీఎం జగన్ సహకరించినందుకు వారు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం 'హర్ దిల్ మే వైఎస్సార్..', 'హమ్ సబ్ జగన్ కే సాథ్' అనే నినాదంతో కర పత్రాలను సత్యనారయణతో కలసి ప్రదర్శించారు. ఖాజీ గౌస్ మొహిద్దీన్, అబ్దుల్ బషీరుద్దీన్, ఎస్‌కే అహ్మద్, లతీఫ్ ఖాన్, అల్తాఫ్ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వస్త్ర, అన్నదానం

బోట్‌క్లబ్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద ఉన్న విముక్తి కాలనీలో ఉన్న వారికి ఆదివారం కుష్టు రోగులకు నూతన వస్త్రాలు, అన్నదానం చేశారు. క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా ప్రధాన కార్యదర్శి స్టీఫెన్ ఆనంద్ తన జన్మదినం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీటీసీ చర్చి సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై నమ్మకంతో చేరికలు

కాకినాడ రూరల్: మండలంలోని సూర్యారావుపేట మత్స్యకారులు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో ఆదివారం రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో ఆ గ్రామ వైస్సార్ సీపీ నాయకుడు సూరాడ రాజు ఆధ్వర్యంలో జనసేన, టీడీపీలతో పాటు సాగరతీర ఆటో యూనియన్ నుంచి సుమారు 100 మంది రావడంతో వారిని పార్టీలో కన్నబాబు చేర్చుకున్నారు. కన్నబాబు మాట్లాడుతూ సీఎం జగన్‌పై నమ్మకంతో పార్టీలో చేరిన మత్స్యకారులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీలో చేరినవారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి అందరి మేలు కోరుకుంటున్నామన్నారు. సూర్యారావుపేటలో హైవే నిర్మాణం కోసం నిలచిన ఇళ్ల పట్టాలకు సంబంధించి అలైన్‌మెంట్ వచ్చిందని త్వరలో పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సూర్యారావుపేట వంటి మత్స్యకార గ్రామం నుంచి యువకులు, మత్స్యకారులు, ఆటో యూనియన్ కార్మికులు పెద్ద ఎత్తున ఇతర పార్టీ నుంచి తమ పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. పార్టీలో చేరిన వారిలో మల్లే శ్రీను, తిక్కాడ అప్పారావు, మేర శ్రీను, ఉమ్మిడి అమ్మోరియ్య, సూరాడ కృష్ణ, కర్రి నల్లబాబు, ఎల్లబోయిన చిన్నా తదితరులు ఉన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జమ్మలమడక నాగమణి, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన సూర్యారావుపేట మత్స్యకారులు

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు



చీడిగలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- చీడిగలో గడప గడపకూ మన ప్రభుత్వం
- సచివాలయం, వైఎస్సార్ క్లినిక్ భవనాలకు ప్రారంభోత్సవం

కాకినాడ రూరల్: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతున్నాయని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని చీడిగలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. తొలుత గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.17.5 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ క్లినిక్ భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో గడప గడకు మన ప్రభుత్వం నిర్వహించారు. గ్రామ పార్టీ నాయకుడు కొప్పిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చీడిగ గ్రామాభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్నామని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. మరికొద్ది నెలల్లో ఎన్నికలు వస్తున్నాయని, ఇదే అభిమానం తమపై చూపి, నవరత్న పథకాలు అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. గ్రామంలో ఈ కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన కొప్పిశెట్టి గణేష్‌ను అభినందించారు. ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, జేఎస్‌కే మండల కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, గ్రామ నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పచ్చదనాల మట్టి నెత్తురోడింది..!

- మణిపూర్ మృగక్రీడపై కవనాయుధం
- నగ్నత్వానికి ఇక భయపడక్కర్లేదని ఓ రచయిత్రి ఆక్రోశం
- మానవతను తట్టిలేపిన 'జనకవనం'

కాకినాడ కల్చరల్: అమానుష వికృత క్రీడకు ఆదివాసీ పచ్చదనాల మట్టి నెత్తురోడుతూ గాయాల పచ్చిదనాన్ని స్రవిస్తోందని.. నిశ్శబ్దపు కొండకోనల్లో తెగిపడిన ఆర్తనాదంలా మానవత్వం నగ్నంగా శిలువ వేయబడిందని.. అమాయకపు అడవిబిడ్డల దేహాలు ముష్కర చూపుల అగ్నిశిఖలపై ఖండ ఖండాలుగా వేలాడుతున్నాయని ప్రముఖ కవి మార్ని జానకిరామ్ చౌదరి మానవ మృగతృష్ణపై తన ఆక్రోశం వ్యక్తంచేశారు. మణిపూర్ ఆదివాసీ మహిళలపై జరిగిన దాడి అమానుషమని, యావత్ భారతదేశం సిగ్గు పడాల్సిన విషయమని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ప్రభాకర వర్మ అన్నారు. సాహితీ స్రవంతి, యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కచేరిపేట యూటీఎఫ్ హోమ్ సమావేశ మందిరంలో ఆదివారం మణిపూర్ సంఘటనపై 'జనకవనం' పేరుతో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ వేదికపై పాల్గొన్న కవి మార్ని జానకిరామ్ చౌదరి తన కవిత ద్వారా ఆ రాష్ట్రంలోని అమానవీయ ఘటనలపై దండెత్తారు. అలాగే సిరికోనకు చెందిన సి.నాగజ్యోతి శేఖర్ తన కవిత వినిపిస్తూ.. ఇప్పుడిక నగ్నత్వానికి భయపడక్కరలేదు... నెత్తుటి తవ్వకాల్లో గర్భాలయాలు బయల్పడ్డాయి..! రహస్యావయవాలు చరిత్ర నడి రోడ్డుపై తెగిపడ్డాయి..! సిగ్గుతెర చింపబడ్డ నిండు ఆకాశం రెండు చేతులతో తనను దాచుకునే అవకాశం లేక నెత్తుటి వస్త్రాన్ని నేస్తూ సాలీడై నడి వీధిలో వేలాడింది! జన్మస్థానం నుండి కిరాతకంగా తవ్వబడ్డ క(షా)సాయి నదిని ప్రవిస్తూ దేశ పటాన్ని నింపుతోందంటూ రాజకీయ క్రీడను దునుమాడారు.

కులమతాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టే సంఘ విద్రోహుల కుట్రగా ఈ సంఘటనను సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గనారా అభివర్ణించారు. గరికిపాటి మాస్టారు, మధునాపంతుల సత్యనారాయణ, మేడిశెట్టి శ్రీరాములు, గౌరినాయుడు తదితరుల సమ్మేళనానికి హాజరై మణిపూర్‌లోని ఘటనలపై వారి కవితల ద్వారా మానవత్వాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రగంటి నరసింహమూర్తి, ఇబ్రహీం, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



కవి సమ్మేళనంలో పాల్గొన్న సాహితీవేత్తలు

వచ్చేనెల 27 నుంచి 'శివపదం'

- పాటలు, నృత్య పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఋషిపీఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ

కాకినాడ కల్చరల్: ఋషి పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'శివపదం' పేరుతో నిర్వహించనున్న నృత్యకళా పోటీలను విజయవంతం చేయాలని ట్రస్టు కో-ఆర్డినేటర్ చావలి రామ్మూర్తి కోరారు. స్థానిక అశోకనగర్‌లోని ట్రస్టు కార్యాలయంలో ఆదివారం పోటీల బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసురాలు, కార్యక్రమ నిర్వాహకురాలు పెద్దాడ సూర్యకుమారి మాట్లాడుతూ స్థానిక సూర్యకళామందిర్‌లో వచ్చే నెల 27 నుంచి 29 వరకు ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. 27న పాటల పోటీలు ఉదయం 9 గంటల నుంచి నిర్వహస్తామన్నారు. అలాగే నృత్యపోటీలు 28, 29వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ రచించిన పాటల్లో ఒకపాటను ఎంపిక చేసుకుని ఆలపించాలని ఆమె తెలిపారు. అలాగే ఒక పాటను ఎంపిక చేసికొని అనుగుణం నృత్యప్రదర్శన చేయాలనీ ఆమె వివరించారు. ఐదు నుంచి 15 ఏళ్ల లోపు జూనియర్స్ విభాగంగాను, 15 ఏళ్ల పైబడిన వర్గాలను సీనియర్స్ విభాగంగా పరిగణిస్తామని పెద్దాడ తెలిపారు. విజేతలకు నగదు బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. అసక్తి గలవారు ఆగస్టు 20వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 99631 10942 మొబైల్ నంబరులో సంప్రదించాలనీ ఆమె కోరారు. రామచంద్రరావు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న చావలి రామ్మూర్తి, పెద్దాడ సూర్యకుమారి తదితరులు

ఆహ్లాదం.. సాగర తీరం..

కొత్తపల్లి: మండలంలోని కోనపాపపేటతో పాటు ఉప్పాడ తీర ప్రాంతం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. వరుసగా మూడు రోజుల పాటు సెలవు రోజులు కావడంతో కొత్తపల్లి మండలం నుంచే కాకుండా పిఠాపురం, సామర్లకోట, గొల్లప్రోలు, కిర్లంపూడి, కత్తిపూడి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి కడలి కెరటాలలో కేరింతలు కొడుతూ ఆహ్లాదంగా గడిపారు. ఉప్పాడ నుంచి నేమాం వరకూ ఉన్న బీచ్‌రోడ్డులో పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది. పర్యాటకుల వాహనాలతో ఉప్పాడ–కాకినాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తీర ప్రాంతంలో ఎటువంటి వసతులు లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



కదలి కెరటాలలో కేరింతలు కొడుతున్న పర్యాటకులు

టమాటా కోసం.. ఇదీ వరస!



గాంధీనగర్ రైతుబజార్‌లో టమాటాల కోసం క్యూ కట్టిన వినియోగదారులు

బోట్‌క్లబ్: టమాటాల కోసం గాంధీనగర్ రైతు బజార్‌లో భారీ క్యూలైన్ పెరిగింది. బహిరంగ మార్కెట్‌లో టమాటాలు కిలో రూ.180 నుంచి రూ.200 వరకూ విక్రయించడంతో ప్రజలు రైతు బజార్‌కు వస్తున్నారు. కిలో రూ.70కి విక్రయించడంతో ప్రజలు వీటిని కొనుగోలు చేసేందుకు వరసలో నిలబడి మరీ కొనుగోలు చేస్తున్నారు.